'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కేంద్రంపై సీఎంల పోరుబాట

కేంద్రం నుంచి న్యాయంగా రావాల్సిన నిధుల కోసం ముఖ్యమంత్రులు ఆందోళన బాట పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వాధినేతల నినాదాలతో ఢిల్లీలోని జంతర్‌మంతర్ దద్దరిల్లుతున్నది. గురువారం నాడు సీఎంల నిరసనలతో దేశ రాజధాని హోరెత్తింది. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ ఉదయం ధర్నా చేయగా.. తమిళనాడుకు చెందిన డీఎంకే, దాని మిత్ర పక్షాల ఎంపీలు సంఘీభావం తెలిపారు. ఆ తర్వాత కొద్దిసేపటికే కేరళ సీఎం విజయన్ కేంద్రం తీరుపై చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు హాజరయ్యారు. 'ఇండియా' కూటమిలోని కాంగ్రెసేతర పార్టీల నేతలూ పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ విపక్షాల సమరోత్సాహం కూడా ఈ నిరసనలకు ఒక కారణం. అయితే కేంద్రం, రాష్ట్రాల మధ్య పన్ను ఆదాయ పంపిణీపై ఏర్పడిన తగాదాలు ఈ నిరసనలకు మూలకారణమన్నది తెలిసిందే. ఈ పోరు అంతిమంగా ఉత్తర, దక్షిణ భారత సమస్యగా పరిణమించే సూచనలూ కనిపిస్తున్నాయి. ఈ సమస్య ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చింది కాదు. ఇటీవలి సంవత్సరాల్లో, ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది జోరందుకున్నది. అత్యధిక పన్ను ఆదాయం సమకూర్చే దక్షిణాది రాష్ట్రాలు అరకొరగా నిధులు పొందుతుంటే, అంతంతమాత్రంగా పన్ను వసూళ్లు కలిగిన ఉత్తరాది రాష్ట్రాలు సింహభాగాన్ని ఎగరేసుకుపోయే విచిత్ర పరిస్థితి ఇందుకు కారణం. 'జనాభాను అదుపులో ఉంచుతూ, అధిక ఉత్పాదకత సాధించి బోలెడంత పన్ను వసూలు చేయడమే మేము చేసిన నేరమా?' అని దక్షిణాది రాష్ట్రాలు వేస్తున్న ప్రశ్నలో సహేతుకత లేకపోలేదు. ఉత్తరాది రాష్ట్రాలు ఉత్తపుణ్యానికి అధిక వాటా దండుకుంటున్నాయనే భావన దక్షిణాది రాష్ట్రాల్లో పాతుకుపోతున్నది. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనడం అంత సులభమైన విషయమేమీ కాదు.

సీఎంలు ఆందోళన బాటపట్టడంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అసహనం వ్యక్తం చేశారు. ఫైనాన్స్ కమిషన్ నిర్ణయం ప్రకారమే అంతా జరుగుతుందని, అందులో తమ ప్రమేయం ఏమీ ఉండదని ఆమె చెప్పుకొచ్చారు. ఇదంతా వేర్పాటువాద ఆలోచనా ధోరణి వల్ల తలెత్తిన సమస్య అని ఓ ముద్ర వేసేందుకు ప్రయత్నించారు. ప్రస్తుత పన్ను వాటాల పంపిణీ 15 ఆర్థిక కమిషన్ సిఫారసుల పరిధిలో జరుగుతున్నది. అయితే ఆ కమిషన్ ఉపయోగించిన సూత్రంపైనే సంపన్న రాష్ట్రాలకు ఏకాభిప్రాయం లేకపోవడం గమనార్హం. పన్నులు ఆదాయాన్ని బట్టి వసూలు చేస్తున్నప్పటికీ, పంపిణీ మాత్రం జనాభా ప్రాతిపదికన జరుగుతుండటం ప్రస్తుత వివాదానికి అసలు కారణం. తక్కువ జనాభా పెరుగుదల కారణంగా సంపన్న రాష్ట్రాలు (దక్షిణాది రాష్ట్రాలు) నష్టపోతున్నాయి. ఆదాయాలు పెద్దగా లేని ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా ఎడాపెడా పెరుగుతుండటంతో అవి కేంద్ర నిధుల్లో అధిక వాటా పొందగలుగుతున్నాయి. నిర్మలమ్మ చెప్పింది నిజమేనని అనుకున్నప్పటికీ, ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల మేరకు పూర్తి నిధులను కేంద్రం కేటాయించడం లేదన్నదీ వాస్తవమే. పనగరియా నేతృత్వంలో నియమించిన 16వ ఫైనాన్స్ కమిషన్ ఏ మేరకు దిద్దుబాటు చర్యలను సూచిస్తుందో వేచిచూడాల్సి ఉంది.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేవలం రాజకీయ కారణాలతోనే సంపన్న (దక్షిణాది) రాష్ట్రాలపై వివక్ష చూపుతున్నదనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న నిరసనల్లో దక్షిణాదికి చెందిన తమిళనాడు, కేరళ, కర్ణాటక పాల్గొంటున్నాయి. కేంద్ర నిధుల విషయంలో అన్యాయానికి గురవుతున్న రాష్ట్రాల్లో మన తెలంగాణ కూడా ఉన్నది. నిధుల విషయమై ఇదివరకటి కేసీఆర్ ప్రభుత్వం కేంద్రంపై అలుపులేని పోరాటం చేసింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ మాత్రం నోరు మెదపడం లేదు. కర్ణాటకలోని సాటి కాంగ్రెస్ ప్రభుత్వం సమరశంఖం పూరించినప్పటికీ ఎందువల్లనో ఇక్కడి సర్కారులో కదలిక లేదు. కేంద్రం భావిస్తున్నట్టు వేర్పాటువాద ఆరోపణల ముసుగులో నిధుల పంపిణీ సమస్యను ఎక్కువకాలం దాచివేయడం కుదరదు. దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే దక్షిణాది రాష్ట్రాల పోరు మరింత ఉధృతం కావడం మాత్రం ఖాయం.

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

కేంద్రంలోని మోదీ సర్కార్ సమాఖ్య స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్నది. రాష్ట్రాల హక్కులను హరించేలా చట్టాలు చేస్తున్నది. న్యాయంగా దక్కాల్సిన పన్నుల వాటా కూడా ఇవ్వడం లేదు. రాష్ట్రాల ఆర్థిక వనరులను దెబ్బ తీస్తూ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నది.

- పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి

అస్తిత్వమే అస్తి

నీడనిచ్చి నిద్రబుచ్చే
మా ఇంటికి నీవే కావలి
మెతుకునిచ్చి బతుకునిచ్చే
మా పొలానికి నీవే కావలి
రాగఝరుల అనురాగసిరుల
పల్లెకి నీవే కావలి
యాగయోగ త్యాగ భోగ
సంస్కృతికి నీవే కావలి
ధైర్య శౌర్య క్రౌర్య
కార్య రక్తసిక్త చరిత్రకి నీవే కావలి
కడుపులో కుళ్లు ముళ్లు
మాటలో తేనెగుళ్లు ఎవడికి కావాలి
అస్తిత్వమే అస్తి
చాప కింద నీరై వెన్నుపోటు దారై
దగా చేయు దోస్తీతో కుస్తీ

కోటం చంద్రశేఖర్
94920 43348

ప్రాజెక్టుల అప్పగింత.. సమస్యలు

శైలేంద్ర జోషి

"కృష్ణానదిపై నిర్మించిన నీటిపారుదల ప్రాజెక్టులు, సంబంధిత ఇతర వ్యవస్థలను రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి అప్పగించడంతో తెలంగాణలో మరోసారి ఈ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం -2014 కింద భారత ప్రభుత్వం కేఆర్ఎంబీ పరిధిపై (ఎస్‌వో 2042 ఈ తేదీ 2021 జూలై 15) ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కృష్ణానదిపై నిర్మించిన దాదాపుగా అన్ని అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల నిర్వహణ కేఆర్ఎంబీ చూసుకుంటుందని తెలియజేసింది. గోదావరి నదిపై ఉన్న ప్రాజెక్టులపై కూడా ఈ తరహా ఏర్పాటు ఉంది.

కృష్ణా, గోదావరి నదులు రెండింటికీ బోర్డుల ద్వారా నిర్వహణ అనే ప్రత్యేక పరిస్థితి ఉంది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు రెండు రాష్ట్రాల్లో అటుసగం, ఇటుసగం అన్నట్టుగా ఉండటం వల్ల సమస్య కొంచెం తీవ్రంగా ఉంది. అంతేకాకుండా కృష్ణానదికి సంబంధించి కొన్ని సున్నిత పరిస్థితుల వల్ల (ఉదాహరణకు పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ నిర్వహణ, కొత్త ఎత్తిపోతల పథకాలు, వీటి ద్వారా విద్యుత్తు తయారీ) పరిస్థితి సంక్లిష్టంగా తయారైంది. అందువల్ల ప్రస్తుతానికి మనం కృష్ణా ప్రాజెక్టులపైనే దృష్టి సారిద్దాం. అయితే నేడోరేపో గోదావరి ప్రాజెక్టులపై కూడా ఆలోచించాల్సి ఉంటుంది.

గెజిట్ నోటిఫికేషన్ వెలువడగానే కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమ్మతి తెలిపింది. కానీ, తెలంగాణ అందుకు నిరాకరించింది. రెండు రాష్ట్రాల మధ్య నదీజలాల కేటాయింపులు తేలకపోవడాన్ని దీనికి కారణంగా చూపింది తెలంగాణ సర్కార్. నోటిఫై చేసిన ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం వల్ల తలెత్తే సమస్యలు ఏమిటి? వాటి పర్యవసానాలు ఎలా ఉంటాయి? అనేది కూడా చర్చనీయాంశమే. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సంబంధిత నిబంధనల్లో ప్రాజెక్టుల పూర్తి జాబితా లేకపోవడం, కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి కఠినమైన నియమ, నిబంధనలు చేర్చకపోవడం, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులపై సందిగ్ధం నెలకొనడం ఈ సమస్యలన్నిటికీ మూలకారణం. చేపట్టాల్సిన చర్యల క్రమాన్ని, ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నీటివాటాల పంపిణీని చట్టం నిర్లక్ష్యం చేసింది. పైగా బోర్డులకు ప్రతిపాదించిన వ్యవస్థాపరమైన ఏర్పాట్లు నిర్వహించాల్సిన కార్యభారంతో పోలిస్తే అరకొరగా ఉన్నాయి.

2014లో బిల్లును రూపొందిస్తున్న సమయంలో ఎదుర్కొన్న అనేక పరిమితుల దృష్ట్యా ఇలాంటి లోటుపాట్లు అనివార్యమే. అయితే సంబంధింత భాగస్వాములందరితో సంప్రదింపులు జరిపి, వివాదాస్పద అంశాలపై దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. నిరంతర కృషి ఫలితంగా జరిగిన రెండు అపెక్స్ కమిటీ సమావేశాలతో కొంత పురోగతి సాధ్యమైనప్పటికీ మౌలిక అంశాలు అపరిష్కృతంగానే ఉండిపోయాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నీటి పంపిణీపై నిరంతర, నిర్మాణాత్మక చర్చల ద్వారా చట్టం పరిధిలో శాంతియుత పరిష్కారం కనుగొనడం సాధ్యమే. తమతమ రాష్ట్రాల ప్రయోజనాల పరిరక్షణకు వేర్వేరు రాజకీయ పార్టీలు సమైక్య వైఖరి తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. రెండు రాష్ట్రాల పరీవాహక హక్కుల పరిరక్షణకు, నిర్వహణాపరమైన సౌలభ్యాన్ని కొనసాగించడానికి విస్పష్టమైన ఏకాభిప్రాయం, వీలైతే విస్తృతస్థాయిలో దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకోవడం చాలా ముఖ్యం. సంబంధిత వాస్తవికాంశాల ప్రాతిపదికన తగిన వైఖరి చేపట్టడం వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. కృష్ణాజలాల పంపిణీపై ఇరు రాష్ట్రాల ప్రయోజనాల పరిరక్షణకు సంబంధిత భాగస్వాముల విజ్ఞత విశాల దృక్పథంతో కూడిన చర్చలకు దారితీయాలి. అందులో నుంచి వెలుగు ఎక్కువ రావాలి, వేడి కాదు.

ఏ ఒక్క అంశమూ తీవ్రమైన జలవివాదంగా మారకుండా ఉండాలంటే అన్నిటికన్నా ముందుగా చేయాల్సింది రెండు రాష్ట్రాల వాటా నిర్ణయించడం. దీన్ని ఇంతవరకు పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఈ అంశాన్ని ట్రిబ్యునల్‌కు నివేదించడానికి జలశక్తి మంత్రిత్వ శాఖకు దాదాపుగా తొమ్మిదేండ్లు పట్టింది. నిర్ణీత కాలవ్యవధిలో న్యాయ నిర్ణయం చేయాల్సిందిగా ట్రిబ్యునల్‌కు నొక్కిచెప్పాల్సిన తక్షణ అవసరం ఎంతైనా ఉన్నది.

సాధారణ, మిగులు, లోటు సంవత్సరాలకు తగిన రీతిలో కేటాయింపులు జరపాలి. పరీవాహక రాష్ట్రాలు తమకు కేటాయించిన మేరకు వాటాలు వినియోగించుకునేలా చూసేందుకు తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. నీటి లభ్యత అంచనాలు, ఇతర అంశాల ఆధారంగా అడ్‌హాక్ కేటాయింపులు జరపడమనేది తాత్కాలిక ఏర్పాటుగానే ఉండాలి. నదీ యాజమాన్య బోర్డుల గత పది సంవత్సరాల పనితీరు గరిష్ఠ పరిష్కారం దిశగా అడుగులు వేసేలా భాగస్వామ్య రాష్ట్రాలకు విశ్వాసం కలిగించలేకపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్రంలో అంతర్గతంగానూ, రాష్ట్రాల మధ్యన నీటిపంపిణీపై, అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల నిర్వహణపై చిత్తశుద్ధితో కూడిన సంప్రదింపులు జరగాలి.

వ్యాసకర్త: రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి

గతం గతః భవిష్యత్తు జాగ్రత్త

"ఒక మనిషి భావ సంస్కారం ఏమిటనేది అతని భాషతోనే తెలుస్తుంది. వ్యక్తిత్వం అతని ప్రవర్తన వల్ల తెలుస్తుంది. ముఖ్యంగా వేల మందికి ఆదర్శంగా ఉండి, వారిని సరైన మార్గంలో నడిపించేవారు తమ భాష, ప్రవర్తన గురించి ఇంకా శ్రద్ధ తీసుకోవాలి. ఎదుటివారు చులకన చేసేటట్టు ఉండకూడదు. ప్రజాకవి కాళోజీ ఎవరింటికైనా వెళ్లినప్పుడు 'మా పని మనిషి' అని పరిచయం చేస్తే, 'మరి మీరు పనికిరాని మనిషా' అని అనేవారు. అదీ సంస్కారం.

కనకదుర్గ దంటు
89772 43484

తెలంగాణలో ప్రస్తుతం పాలన సాగిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరుతో సంస్కారం, భాష, ప్రవర్తన, మాటతీరు తదితర అంశాలు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువగా చర్చనీయాంశమవుతున్నాయి. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయకముందు నుంచే అనధికారిక ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి అన్నీ తానై నడిపించారు. ఇక పదవీ బాధ్యతలు చేపట్టాక చెప్పాల్సిన పనేలేదు. ఇతర నేతలకు క్రెడిట్ దక్కకూడదనే ఉద్దేశంతో ఆరు గ్యారెంటీలకు సంబంధించి ఏ హామీని, ఎప్పుడు అమలు చేస్తారనే వివరాలను స్వయంగా ఆయనే ప్రకటించారు. ఎన్నికలకు ముందే తేదీలతో సహా ప్రకటించి, డిసెంబర్ 9 నుంచి ఇస్తామన్న సంక్షేమ పథకాలను అమలు చేయడం సాధ్యం కాదని తెలుసుకొని మొదటగా అసహనానికి గురైంది ఆయనే. మాజీ ముఖ్యమంత్రిని, వారి కుటుంబ సభ్యులను, తర్వాత ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న రైతులను అసభ్య పదజాలంతో దూషించటం మొదలుపెట్టారు. తన స్థాయిని మరిచి అభ్యంతరకర రీతిలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి తీరు పట్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తుండటాన్ని గ్రహించిన మంత్రులు ఆయనతో స్వరం కలిపారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలే కావడంతో సీఎంపై వ్యతిరేకత రావడం పార్టీకి మంచిది కాదని, ముఖ్యమంత్రిని ప్రజలు తిట్టకూడదని భావించిన పలువురు సీనియర్ మంత్రులు ప్రజలను దూషించడం మొదలుపెట్టారు. రైతుబంధు సాయం అందలేదని చెప్పినవారిని 'చెప్పుతో కొడతాం', 'రోడ్డు మీద ఉరికిస్తాం' అంటూ దుర్భాషలాడటం ప్రారంభించారు. అధికారిక సమావేశాలకు హాజరయ్యే విపక్ష నాయకులను అవమానించటం, అసహనంతో సొంత పార్టీ కార్యకర్తలనే కొట్టడం వంటి తెలివి తక్కువ, అహంకారపూరిత పనులు చేస్తూ ముఖ్యమంత్రిని మించిపోయారు. మెరుగైన పాలన ఆశించి, అభిమానంతో ఓటేసిన తెలంగాణ ప్రజలు వారికి సన్నాసుల్లాగా, ఏమీ చేతకాని వాళ్లలాగా కనిపించటం చాలా విచిత్రంగా ఉన్నది.

ఇక రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఇలా ఉంటే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల వైఖరి, ప్రవర్తన ఇంకా విచిత్రంగా ఉన్నది. ఇరు పార్టీలకూ అధికారదాహమే తప్ప, ఏ రకమైన సిద్ధాంతాలు లేవన్నది స్పష్టమైపోయింది. అందుకు కొన్ని ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణకు ప్రతీకగా నిలిచే స్థానిక పార్టీ బీఆర్ఎస్‌ను ఓడించడానికి కాంగ్రెస్, బీజేపీ ఒక్కటవుతాయి. ఏపీలో బీజేపీ అధికార వైఎస్ఆర్‌సీపీని కొన్నిసార్లు దువ్వుతుంది. మళ్లీ అవసరం పడుతుందేమోనని టీడీపీని కూడా దువ్వుతుంది. అంతేకాదు, తెలంగాణలో బీఆర్ఎస్‌ను ఎదుర్కోవడానికి మోదీని బండబూతులు తిట్టిన చంద్రబాబును స్కాంల నుంచి రక్షించడానికి కూడా బీజేపీ వెనుకాడదు. ఏపీలో టీడీపీతో కలిసి పనిచేస్తున్న జనసేన తెలంగాణలో బీజేపీతో కలుస్తుంది. ఇక విజయశాంతి, జయసుధ లాంటివాళ్లు ఏ రోజు, ఏ పార్టీలో ఉంటారో తెలుసుకోవాలంటే ఆ రోజు పేపర్ చూడాల్సిందే!

రెండు జాతీయ పార్టీల నాయకులాడే రాజకీయ నాటకాలను ప్రజలు ఆపలేరు. వారికి ఉన్న ఒకే ఒక్క అవకాశం ఎన్నికల్లో సరైన పార్టీని ఎన్నుకోవడమే. గత అనుభవాలు, పార్టీల వైఖరి, ఆ పార్టీల పాలనాస్థాయి, వారు తమ రాష్ట్రం పట్ల వ్యవహరిస్తున్న తీరు.. ఇవన్నీ బేరీజు వేసుకొని ప్రజలు తమ ఓటును వినియోగించుకోవాలి. ఇప్పటిలాగా ఎన్నికల తర్వాత బాధపడే పరిస్థితి తెచ్చుకోకూడదు.

తెలంగాణ శాసనసభ ఎన్నికలు ముగిశాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. న్యాయపరంగా మనకు దక్కాల్సిన నిధుల కోసం కూడా కేంద్రంతో పోరాడాల్సి వస్తున్నది. అందుకోసం ఈ ప్రాంతం మీద అభిమానం, ఈ ప్రాంతం పట్ల నిబద్ధత ఉన్న సభ్యులు తప్పనిసరిగా పార్లమెంట్‌లో ఉండాలి. కేంద్రంలోని బీజేపీ సర్కార్ తెలంగాణపై అంతులేని వివక్ష చూపిస్తున్నది. దాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ పదేండ్ల పాటు కేసీఆర్ రాష్ట్రాన్ని కాపాడారు. అంతేకాకుండా నిధులు సమకూర్చుకొని అన్ని రంగాలను అభివృద్ధి చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. కానీ, కాంగ్రెస్ నాయకుల అసత్యాలను నమ్మిన ప్రజలు, వారిచ్చిన బూటకపు వాగ్దానాల భ్రమలో పడి ఆ పార్టీని ఎన్నుకున్నారు. నమ్మిన ప్రజలను ముంచడంలో సిద్ధహస్తులైన కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీద అరుపులు అరుస్తున్నారు. ఇచ్చిన హామీలను ఎగ్గొట్టేందుకు దారులు వెదుకుతున్నారు.

ఒక్క విషయం ఆలోచిద్దాం! 2014లో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు రాష్ట్ర ఖజానా నిండా ధనం మూలుగుతున్నదా? అభివృద్ధితో రాష్ట్రం వెలిగిపోతున్నదా? డిస్కంలను ఆంధ్రాలో పెట్టుకొని లోయర్ సీలేరు ప్రాజెక్టుతో సహా ఏడు మండలాలు ఆంధ్రా పాలకులు లాక్కున్నారు. అంతేకాకుండా వారేదో అంతకుముందు తెలంగాణలో బ్రహ్మాండమైన వసతులను కల్పించినట్టు 'తెలంగాణ వస్తే కరెంటు ఉండదు, నీళ్లుండవు' అని బెదిరించారు.

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కాకుండానే కాంగ్రెస్, టీడీపీ నాయకులు శాసనసభలోకి ఎండిపోయిన వరికంకులను తీసుకొచ్చి గందరగోళం సృష్టించారు. పాలనాకాలం 40 రోజులా? 50 రోజులా? అన్నది లెక్కకాదు, నాయకుని ప్రణాళికలు ఎలా ఉన్నాయి, పాలకుల ప్రవర్తనలో ఎంత నిబద్ధత ఉందనేదే లెక్క. వాస్తవానికి ప్రగతిభవన్ ముందు కాంగ్రెస్ కూలగొట్టిన కంచెలు ఆ పార్టీ నిర్మించినవే. అక్కడి భద్రతా సిబ్బంది రోజంతా ఎండలో నిలబడుతున్నారని, వారికోసం కేసీఆర్ ఒక షెడ్డు నిర్మించారు. ఆ కంచెలు వేసినవారు గొప్పా? కింది స్థాయి ఉద్యోగులకు ఎండ తగలకుండా వసతి కల్పించినవారు గొప్పా? అటువంటి పనులే పాలకుడి పాలనా దక్షతకు నిదర్శనంగా నిలుస్తాయి.

ఇక గత తొమ్మిదేండ్లలో పుట్టబోయే బిడ్డ దగ్గర్నుంచి చనిపోయిన వారి దాకా అందరికీ ఉపయోగపడేలా కేసీఆర్ కల్పించిన వసతులు మన కండ్లముందే ఉన్నాయి. అందుకే, తమ నాయకుడు చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు తమనే మళ్లీ ఎన్నుకుంటారని బీఆర్ఎస్ నేతలు భ్రమపడ్డారు. నిజానికి తమ పార్టీకే ఓటు వేయాలని కేసీఆర్ ఎప్పుడూ చెప్పరు. ప్రతి ఓటరు ఆలోచనాస్థాయి పెరగాలని, ప్రజాస్వామ్యం గెలవాలని ఆయన ఆశిస్తారు. పనిని చూసి, అభివృద్ధిని గమనించి, పార్టీల విధానాలను విశ్లేషించుకొని తెలివిగా ఓట్లేస్తేనే ప్రజలు గెలుస్తారని ఆయన పదే పదే చెప్తుంటారు. కానీ, జరిగిపోయినదాన్ని ఎవరూ మార్చలేరు. గడిచిపోయిన కాలం తిరిగిరాదు. అది నేర్పే అనుభవాలే మన భవిష్యత్తు బాగుండటానికి బాటలు వేస్తాయి.

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రధాన పార్టీలు. తెలంగాణ రాష్ట్రంపై బీజేపీ చూపిస్తున్న ద్వేషం, ప్రజల పట్ల చూపుతున్న వివక్ష అందరికీ తెలిసిందే. అంతేకాకుండా దేశ సంపదను గుజరాతీ వ్యాపారులకు మోదీ ప్రభుత్వం ఎలా దోచిపెడుతున్నదో గమనిస్తూనే ఉన్నాం. ఇతర మతాలను ద్వేషించే ఆ పార్టీకి, తెలంగాణ సహజ సంస్కారానికి పొసగదు. మనుషులంతా ఒక్కటేనన్న సనాతన ధర్మం పాటించే తెలంగాణ విశాల హృదయానికి మత మౌఢ్యం, కుల పిచ్చి అర్థం కావు. అందుకే బీజేపీకి ఓటేస్తే తెలంగాణ సంస్కృతి విచ్ఛిన్నమవుతుంది.

ఇక సోనియమ్మ రాష్ట్రం ఇచ్చిందని చెప్తూ పబ్బం గడుపుకొనే తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో ఏనాడూ పాల్గొనలేదు. అందుకే ఇక్కడి ప్రజల బాధలు వారికి అర్థం కావు. అందుకే సొంత రాష్ట్ర ప్రజలనే వారు చెప్పులతో కొట్టగలరు, చంపి బొంద పెట్టగలరు. 44 ఏండ్లు ఈ ప్రాంతాన్ని పాలించి నిధులను అడ్డంగా దోచుకున్న ఆ పార్టీ వల్ల తెలంగాణకు నష్టమే కానీ, ఎటువంటి లాభం లేదు. ఇప్పుడు కూడా తెలంగాణ ఆదాయమంతా కాంగ్రెస్ పార్టీకి వెళ్తున్నది.

వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం తెలంగాణ ప్రజలను మళ్లీ మభ్యపెట్టడానికి కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు రంగంలోకి దిగారు. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు ఏం చేస్తారంటే.. ఒకటి, రెండు సంక్షేమ పథకాలను అమలు చేసి, ఓట్లు దండుకోవడానికి ప్రయత్నిస్తారు. అది చూసి ఈసారి ప్రజలు మళ్లీ వారి భ్రమలో పడితే, పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఒక్క సంక్షేమ పథకం కూడా అందదు. ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి. మరోసారి మోసపోకుండా ఇంటి పార్టీ అయిన బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలి. లేకపోతే, గత రెండు నెలలుగా అనుభవిస్తున్న సంక్షోభమే, మరో ఐదేండ్లు అనుభవించాలి. తస్మాత్ జాగ్రత్త!

ప్రశ్నిస్తాం.. నిలదీస్తాం.. సాధిస్తాం!

"అలవిగాని హామీలు ఇచ్చి, ఆరు గ్యారెంటీలంటూ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ పార్టీ. ఆరు గ్యారెంటీలే కాకుండా దాదాపు 420 హామీలు ఇచ్చింది ఆ పార్టీ. వాటిలో ప్రధానపాత్ర పోషించింది మాత్రం యూత్ డిక్లరేషనే. హైదరాబాద్ వేదికగా ప్రియాంకాగాంధీ యూత్ డిక్లరేషన్ పేరిట మోసానికి తెరలేపారు.

తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ దగాపడ్డదని, కాంగ్రెస్ ఉద్యోగాలు కల్పిస్తుందని చెప్తూ అరచేతిలో స్వర్గం చూపించారు ప్రియాంక. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమ బతుకులు బాగుపడతాయని భావించిన యువతను కాంగ్రెస్ నిండా ముంచింది.

కేసీఆర్ హయాంలో ఉద్యోగ కల్పనే జరగలేదన్నట్టుగా సోషల్‌మీడియా ద్వారా ఆ పార్టీ ప్రచారం చేయించింది. దీన్ని గుడ్డిగా నమ్మిన యువతీయువకులు బీఆర్ఎస్‌కు దూరమయ్యారు. కానీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. తొమ్మిదిన్నరేండ్ల ఏలుబడిలో 1.63 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించారు కేసీఆర్. దేశంలోని ఇతర ఏ రాష్ట్రం కూడా ఈ విషయంలో తెలంగాణ దరిదాపుల్లో లేదు. కానీ, బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ సర్కార్ దీన్ని ప్రచారం చేసుకోలేదు. అదే సమయంలో సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ దుష్ప్రచారం చేసింది.

రెండు నెలలైనా యూత్ డిక్లరేషన్‌పై రేవంత్‌రెడ్డి సర్కార్ ఎటువంటి కార్యాచరణ రూపొందించలేదు. నెలకు రూ.4,500 నిరుద్యోగ భృతి ఇస్తామని గప్పాలు కొట్టి.. నేడు చేతులు ఎత్తేసింది. 'నిరుద్యోగ భృతి ఇస్తామని మేం చెప్పలేదు' అంటూ అసెంబ్లీ సాక్షిగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాటమార్చారు. అందరికీ ఉద్యోగాలు ఇవ్వలేమని పేర్కొంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ నైజాన్ని బయటపెట్టారు. ఫిబ్రవరి 1న విడుదల చేస్తామన్న జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తడం లేదు పాలకులు.

ఉద్యోగ కల్పన గురించి పెదవి విప్పని రేవంత్‌రెడ్డి.. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన కొలువులను తాను కల్పించినట్టుగా చెప్పుకోవడం గమనార్హం. స్టాఫ్ నర్సింగ్, సింగరేణి తదితర ఉద్యోగాలను కేసీఆర్ సర్కారే భర్తీ చేసింది. కానీ, ఆ ఉద్యోగాల నియామక పత్రాలు అందజేస్తూ, సంబంధిత క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకోవాలని రేవంత్‌రెడ్డి ఉవ్విళ్లూరుతున్నారు.

కేసీఆర్‌పై నిందలేస్తూ ఉద్యోగాలను భర్తీ చేయకుండా తప్పించుకోవాలని రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. చైతన్యం కలిగిన తెలంగాణ యువత ఈ విషయాన్ని ఎప్పుడో పసిగట్టింది. ఉద్యోగాలు భర్తీ చేసే వరకు యువతీయువకులు ప్రశ్నిస్తూనే ఉంటారు, నిలదీస్తూనే ఉంటారు.

- జి.రాజేష్ నాయక్